
శ్రీ వాకాటి పాండురంగారావు స్మారక కథా పురస్కారంలో
(జాగృతి దీపావళి కథల పోటీ) ద్వితీయ బహుమతి పొందిన కథ !

# శైశవగీతి



"బై.......బై.........."

స్కూల్ బస్సుదిగి బస్సులోని మిత్రులకు ఉత్సాహంగా వీడ్కోలు చెప్పాడు బన్నీ.

భుజాలకి తగిలించుకున్న పుస్తకాల బ్యాగ్ వెనక్కి లాగుతోంది. ముందుకు వంగి దాన్ని బ్యాలన్స్ చేసుకుంటూ చేతిలోని గిఫ్ట్‌ని గట్టిగా పట్టుకుని ఇంటివైపు పరుగుపెట్టాడు.

అవాళ ఓ సంస్థ వారు స్కూలు కొచ్చారు. టెర్రరిజం గురించి వివరించారు. లుంబినీ పార్కులో బాంబు పేలుళ్ళ ఘటన గురించి ఏమనుకున్నారో పది లైన్లు రాయమన్నారు.

బన్నీ ఏం రాయాలా, ఎలా రాయాలా అని తికమక పడి పడి రెండు వాక్యాలు రాశాడు.

'లుంబినీ వనంలో బుద్ధుడు పుట్టాడు. ఎందరో సంతోషించారు. లుంబినీ పార్కులో బాంబులు పేలాయి. ఎందరో చనిపోయారు ' – అని రాశాడు.

ఆ కాసిని మాటల్నీ ఎంతగానో మెచ్చుకోవడమే గాక బహుమతి కూడా ఇచ్చారు.

అదిగో ఆ క్షణం నుంచి పట్టరానంత ఆనందంగా వుంది వాడికి. మమ్మీ డాడీలకి ఎప్పుడా వార్త చెప్పి వారి మెప్పు పొందుదామా అని తహతహగా వుంది – ఒంటి మీద ఏడేళ్ళు కూడా లేని ఆ పసివాడికి.

ఇంటిని సమీపిస్తూనే నీరుకారిపోయాడు.

తాళం వేసి వుంది – రోజూలానే !

బన్నీ తల్లిదండ్రులిద్దరూ డాక్టర్లే. బిజీ పీపుల్. రాత్రి పదింటికిగాని ఇంటికి తిరిగిరారు. ఆ సంగతి వాడికీ తెలుసు. అయినా ఏదో ఆశ ఊరించింది.

నీరసంగా తాళం తీసి లోపలికెళ్ళాడు. డోర్ లాక్ చేసి సోఫాలో కూలబడ్డాడు.

ఏడుపు రాబోయింది. నిగ్రహించుకున్నాడు.

బహుమతి వంక చూశాడు. అదేవిటో తెలుసుకోవాలన్న ఆత్రం కలిగింది. చటుక్కున లేచి గిఫ్ట్‌కవర్ విప్పాడు.

గాంధీ గారి మూడు కోతుల బొమ్మ. ముచ్చటగా వుంది. దాన్ని నిమిరి మురిసిపోయాడు. నెత్తి మీద పెట్టుకుని గెంతాడు.

దాన్ని అందరికీ కన్పించేట్టు పెడతే చూసిన వాళ్ళంతా మెచ్చుకుంటారనుకున్నాడు. తగిన చోటు కోసం చూశాడు.

కార్నర్ బల్ల కన్పించింది. వాడి కళ్ళు మెరిశాయి. దాని మీది పూలకూజా తీసేసి బహుమతి బొమ్మ పెట్టాడు. దగ్గర్నుంచీ దూరాన్నుంచీ చూశాడు. ఎంతో బాగా అన్పించింది. గర్వంగా ఫీలయ్యాడు.

ఇంతలో ఫోన్ మ్రోగింది. గబుక్కునెళ్ళి "మమ్మీ..." అంటూ చెప్పబోయాడు.

వినే మూడ్‌లో లేదామె. " జ్యూస్ త్రాగావా ? "

"నో మామ్. ఇవాళ స్కూల్లో...."

"స్కూల్ గోలనాకెందుగ్గాని ముందెళ్ళి జ్యూస్ తాగు. తర్వాత బుద్ధిగా చదువుకో. ఊరికే టీవీ చూస్తూనో, వీడియోగేమ్స్ ఆడుతూనో టైం వేస్ట్ చెయ్యకు. నెక్స్ట్మంత్ ఐఐటి ఫౌండేషన్‌కి హోం ట్యూషన్ అరేంజ్ చెయ్యాలనుకుంటున్నాం. నువ్వెలాగైనా సరే ఐఐటియన్‌వి కావాలి. ఐఐఎమ్‌లో ఎంబిఎ చేసి బిజినెస్ ఎగ్జిక్యూటివ్ కావాలి. మెడికల్ లైన్లో కూడా వాళ్ళదే రాజ్యమైపోయింది...."

రోజూ వినే దండకమే. బుంగ మూతి పెట్టుకుని బుద్ధిగా విన్నాడు.

"ఓకే మామ్ " ఫోన్ పెట్టేశాడు. ప్రక్కనే వున్న బాల్‌ని ఉక్రోషంతో తన్నేడు.

జ్యూస్ త్రాగి, గీజర్ ఆన్ చేసి వచ్చి, టీవీ పెట్టాడు.

ఎడ్వర్టైజ్‌మెంట్లు వస్తున్నాయి. అవంటే బన్నీకెంతో ఇష్టం. వాటిల్లో అమ్మా నాన్నా పిల్లలూ ఎంతో అన్యోన్యంగా ఆనందంగా వుండటం వాడికి బాగా నచ్చుతుంది. ఆసక్తిగా చూశాడు.

ఒక కుర్రాడు వర్షంలో తడిసి తుమ్ముతూ ఇంటికొచ్చాడు. తల్లి వాడి తల తుడిచి ఛాతీకి ఏదో బామ్ రాసింది. ఎంతో రిలీఫ్ ఫీలై తల్లి మెడ చుట్టూ చేతులేసి హత్తుకుపోయాడు.

వాడి స్థానంలో తననీ, తల్లి బదులు మమ్మీనీ ఊహించుకోడానికి ప్రయత్నించాడు. ఊహు సాధ్యం కాలేదు !

టీవీ కట్టేసి వెళ్ళి స్నానం చేసొచ్చాడు.

ఒంటికి టవల్ చుట్టుకుని ఏదో యాడ్‌లోలా హాలంతా గెంతాడు. అలా డాన్స్ చేస్తూనే ఫ్రిజ్‌లోని బిస్కెట్స్ తీసుకుని తిన్నాడు. ఎనర్జీ డ్రింక్ త్రాగాడు.

పిమ్మట బుద్ధిగా కూర్చుని హోంవర్కు పూర్తి చేశాడు.

సైన్స్ పుస్తకం తీశాడు. యూనివర్స్ గురించీ సూర్యుడి గురించీ చదువుతోంటే ఏదో అనుమానం వచ్చింది. వెంటనే క్లాస్‌మేట్ పావనికి ఫోన్ చేశాడు.

"పావనీ ! మొన్న డ్రాయింగు క్లాసులో సన్‌ని రెడ్‌గా వేశావు కదా. లెసన్లో వేడి ఎక్కువ గాని వైట్ గానే వుంటుందని వుంది. సన్ ఎప్పుడూ వైటే. రెడ్ కాదు "

"నేను మార్నింగ్ సన్‌ని వేశాను "

"మార్నింగూ వైటే. నేను రోజూ చూస్తున్నాగా ! "

"కాదంట. ఎర్లీమార్నింగ్ రెడ్డిష్‌గా వుంటాట్ట. మా బామ్మ చెప్పింది "

"నేన్నమ్మను "

"మా బామ్మ అబద్ధం చెప్పదు "

"ఐసీ " రిసీవర్ పేట్టేశాడు.

పెదవి కొరుక్కుంటూ ఆలోచించాడు. 'ఎలాగైనా సరే రేప్పొద్దుటే లేచి మార్నింగ్ సన్‌ని చూడాలి. కలరేవిటో కన్ఫర్మ్ చేసుకోవాలి' అనుకున్నాడు. అప్పటిగ్గాని వాడి మనోసంద్రం శాంతించలేదు.

వీడియో గేమ్ ఆడాడు. మొదట ఉత్సాహంగా అన్పించినా తర్వాత బోర్ కొట్టింది.

ఆ గదిలోంచి ఈగదిలోకి, ఈ గదిలోంచి బాల్కనీలోకీ కలతిరిగాడు.

తల్లితోనో తండ్రితోనో లేక ఇద్దర్తోనో కబుర్లు చెబుతూ వెళ్తోన్న పిల్లలు కన్పించారు. అభిమానంగా చూశాడు. తర్వాత అసూయగా చూశాడు. ఆపైన నిట్టూర్చాడు.

టీవీ ఆన్ చేశాడు. పిల్లల డాన్సు పోటీ చూశాడు. ' పోగో 'లో చిత్ర విచిత్ర విన్యాసాలు చూశాడు. కాస్సేపటికే విసుగొచ్చింది.

హాట్‌ప్యాక్‌లోని అన్నం కూర వడ్డించుకుని తిన్నాడు.

కథల పుస్తకం తిరగేస్తోంటే నిద్రొచ్చింది. టెడ్డీ బేర్‌ని గట్టిగా గుండెలకి హత్తుకుని నిద్రపోయాడు.

రాత్రి పదిగంటల టైంలో వచ్చారు బన్నీ పేరెంట్స్.

కార్పోరేట్ హాస్పటల్లో పని చేస్తున్నారు. ఆ డ్యూటీ అయ్యాక స్వంత క్లినిక్కులో ఓపీల్ని చూసి వచ్చారు.

బాగా అలసిపోయారు. అవాల్టి ఆదాయాన్ని లెక్కపెట్టి కట్టలుగా కట్టడానికి ఓపిక లేక పోయింది. నోట్లని బాక్సులో వేసేశారు.

స్నానం చేసి ఓవెన్‌లో రెడీమెడ్ చపాతీలు వేడి చేసుకుని ఉదయపు కూరతో తిన్నారు.

మంచమెక్కి మెడికల్ జర్నల్ చేతుల్లోకి తీసుకున్నాడు భాస్కర్. లలిత బన్నీరూంలో కెళ్ళి వాడి ప్రక్కన కూర్చుంది. జుట్టు నిమిరింది. కొడుకు అమాయకపు లేత మొహం చూసేసరికి గిల్టీగా అన్పించింది.

'మదర్ పాత్రకి న్యాయం చెయ్యలేక పోతున్నాను. బట్ నో వే .....' అనుకుంది. వాడి నుదుట ముద్దు పెట్టుకుని తమ గదిలోకెళ్ళిపోయింది ఆవులిస్తూ.

ఉదయమే లేచాడు బన్నీ. చప్పుడు చెయ్యకుండా ఫ్లాట్‌లోంచి బయటపడ్డాడు. లిఫ్ట్‌లో టెర్రేస్ పై కెళ్ళాడు.

తెల్లని వెలుగు పరచుకునుంది. కాని సూర్యుడ్ని కనబడనివ్వకుండా చేస్తున్నాయి చుట్టూవున్న ఎత్తైన భవనాలు . ఏ మూలనుంచైనా సూర్యుడు కన్పిస్తాడేమోనని చుట్టూ తిరిగాడు. ఆశగా వెదికాడు. కాంక్రీట్ జంగిల్ వాడి చిరుకోరికను నెరవేరనివ్వలేదు.

'ఏమైనా సరే ఇవాళ బాలసూర్యుడి రంగేవిటో తేల్చెయ్యాల్సిందే ' అనుకుంటూ తూర్పుకి కళ్ళప్పగించి కూర్చున్నాడు.

మరో అరగంటకి ఆకాశహర్మ్యాల వెనుక నుంచి పైకొచ్చాడు సూర్యుడు.

తెల్లగా ప్రకాశిస్తున్నాడు.

వెర్రిసంబరం కలిగింది. ఒక్కంగలో ఇంట్లోకెళ్ళాడు. పావనికి ఫోన్ చేశాడు.

'నువ్వు అబద్ధం చెప్పేవు. మార్నింగ్ సన్ కూడా తెలుపే " అని చెప్పి పెట్టేశాడు.

పని మనిషి వచ్చింది. " ఇంకా స్నానం చెయ్యలేదా ? హమ్మో బస్సొచ్చేస్తాది...." తొందరపెట్టింది.

బాత్రూంలో దూరాడు.

డ్రెస్సప్ ఐ వచ్చేసరికి పాలల్లో కార్న్‌ఫ్లాక్స్ వేసిచ్చింది. అయిష్టంగా బలవంతంగా తిన్నాడు.

లంచ్ బాక్స్ తీసుకెళ్ళక్కర్లేదు. స్కూల్లోనే లంచ్ వుంటుంది. వారైతేనే సమగ్రమైన పోషకాహారం పెట్టగలరని ఆ ఇంటర్నేషనల్ స్కూల్ వారి నమ్మకం.

ఆవులిస్తూ వచ్చింది లలిత. " హాయ్ ! మై సన్..."

పరుగునెల్లి తల్లిని చుట్టేశాడు. వాడ్ని దూరంగా వుంచుతూ " స్కూల్ డ్రెస్ నలుగుతుందిరా. మళ్ళీ పింక్ స్లిప్ పెడతారు. బ్రేక్ ఫాస్ట్ చేశావా ? స్కూల్లోని లంచ్ బావుంటోందా ? "

తలూపి ఏదో చెప్పబోయాడు. ఇంతలో బయట బస్సు హారన్ విన్పించింది.

"వెళ్ళొళ్ళు బై....."

"డాడీకి చెప్పు మామ్..."

బన్నీ, వాడి బ్యాగ్ మోస్తూ పని మనిషీ వెళ్ళారు.

బన్నీ ఏసీ బస్సు ఎక్కటం బాల్కనీలోంచి చూసింది. బస్సు కదలగానే తిరిగి హాల్లోకొచ్చింది లలిత.

కార్నర్ బల్ల మీది మూడు కోతుల బొమ్మ మీద పడిందామె దృష్టి.

నుదురు ముడి వేసింది. " ఇదెక్కడ్నుంచొచ్చిందబ్బా " అనుకుంటూ దగ్గరి కెళ్ళి దాన్ని చేతుల్లోకి తీసుకుని నిమిరింది.

'బన్నీకి స్కూల్లో ఇచ్చిన ప్రైజ్ అయ్యుంటుంది. కాస్త ముందే చూసివుంటే కంగ్రాట్స్ చెప్పేది.....!'

నిట్టూరుస్తూ తిరిగి దాన్ని యథాస్థానంలో పెట్టేసింది.

* * *

స్కూల్లో విలేజ్ గురించి చేప్పేరు. అదేవిటో ఎలా వుంటుందో బన్నీకి అంతుబట్ట లేదు. పావనిని అడిగాడు.

"గ్రీన్‌గా వుంటుంది " భుజాలెగరేస్తూ చెప్పింది.

డాడీని అడిగి తెలుసుకోవాలనుకున్నాడు. కాని ఆదివారం మధ్యాహ్నానికి గాని

అవకాశం చిక్కలేదు.

"డాడ్ ! విలేజ్ అంటే ఏవిటి ? "

"పల్లెటూర్రా "

"అంటే ఏవిటి ? "

"విలేజ్. ఐమీన్... పొలాలూ చెట్లూ కాలువలూ రైతులూ పశువులూ వుంటాయి. చిన్న చిన్న ఇళ్ళుంటాయి. మట్టిరోడ్లు......."

"ఐసీ. హ్యారీ పోటర్ ఇల్లుందే ఆ టైపా ? "

"అహ. పెంకుటిళ్ళు .... సినిమాల్లో చూస్తూంటాం కదా. హీరో హీరోయిన్లు పొలాల గట్లంట పాటలు పాడుతూ తిరుగుతారు చూడు...."

వాడి ఊహకందట్లేదని వాడి ముఖంలోని ఫీలింగ్స్‌ని బట్టి గ్రహించాడు.

"వడ్లు కాచే మొక్కలు తెలుసు కదా..."

"వడ్లేవిటి ?"

"వడ్లు తెలీదా ! మనం తింటున్న అన్నం ఎలా వస్తుందనుకుంటున్నావు చెప్పు?"

"బియ్యం బాయిల్ చేస్తే "

"బియ్యం ఎక్కడ్నుంచొస్తున్నాయి...? "

"బజార్లో కొంటే వస్తాయి " గబుక్కున అంది అటుగా వచ్చిన లలిత.

అవునంటూ తలాడించాడు బన్నీ.

"అదికాదురా. అవెలా పండుతాయంటే...వరిచేలుంటాయి. వరి మొక్కలకి కంకులు వేస్తాయి. కంకుల గింజలు తయారయ్యాక మొక్కల్ని కట్ చేసి ఎండలో ఆరబెడతారు. తర్వాత వాటిని కుప్పలా వేస్తారు. పశువుల్తోనో ట్రాక్టర్‌తోనో తొక్కిస్తే వడ్లగింజలు వేరవుతాయి. వాటిల్లోంచి పొల్లు తీసేసి వడ్లగింజల్ని బస్తాల్లో రైస్ మిల్లుకి తీసుకెళ్తారు. మిల్లులో వడ్ల మీది కవచాన్ని ఐ మీన్ కవర్ని తొలగిస్తారు. తెల్లని బియ్యం వస్తాయి. అవి వండితే అన్నం అవుతుంది "

మహాశ్చర్యంగా చూశాడు. వాడెంతవరకూ ఫాలో అయ్యాడో అర్థంగాకపోయినా ఒక రైతు మనవడికి అన్నం ఎలా వచ్చిందో తెలీక పోవడం ఎంతో గిల్టీగా అన్పించింది భాస్కర్‌కి.

తిండిగింజలెలా ఎక్కడ్నుంచి వస్తాయో లాంటి బేసిక్స్ ఇంట్లో తాము చెప్పలేదు. స్కూల్లోనూ చెప్పటం లేదు. కాని కంప్యూటర్ల గురించీ అంతరిక్షం గురించీ చదివిస్తున్నాం!

ఎంతో అవమానంగా అన్పించింది " ఐడియా .... " అంటూ టీవీ పెట్టాడు. చకచకా ఛానల్స్ మార్చాడు.

డాన్సులు పాటలు క్విజ్‌లు ఇంగ్లీషు సినిమాలు అర్బన్ సీరియల్స్.... ఎక్కడా పల్లె

జాడ లేదు !

"ఏ ప్రోగ్రాం కోసం గాలిస్తున్నారేవిటి తండ్రీకొడుకులు" చేతులు న్యాప్కిన్‌తో తుడుచుకుంటూ కిచెన్‌లోంచి వచ్చింది లలిత.

ఆదివారం నాడు లంచ్ తనే వండి వడ్డిస్తుంది. డిన్నర్ మాత్రం బయట అటూ ఇటూ తిరిగి హొటల్లో చేస్తారు.

"బన్నీకి విలేజ్ తెలీదంట !"

"మీరు చెప్పండి. పల్లెటూరి వారేగా !" నవ్వింది.

"చెప్పేను. క్యాచ్ చెయ్యలేక పోతున్నాడు. తీపి ఎలా వుంటుందో ఎంతవర్ణించినా నో యూజ్. రుచి చూపించాల్సిందే. వీడికి సిటీ తప్ప బయటి ప్రపంచం చూపించకపోవడం మనదే తప్పు "

"ప్రపంచం పల్లెటూళ్ళల్లో లేదు మహానగరాల్లోవుంది. విదేశాల్లో వుంది. ఈసారి సింగపూర్ ట్రిప్‌కి ప్లాన్ చేద్దాం భాస్కర్ "

"వూహు. మా ఊరెళ్దాం "

"అక్కడ నాకేం తోచదు. పరమబోర్. ఆ మట్టీ ఆ పశువులూ ఆ అపరిశుభ్రతా ఐ కాంట్ బేర్. బన్నీనీ తీసుకెళ్ళనివ్వను "

నవ్వేడతడు. " నువ్వు సిటీలో పుట్టి పెరిగావు గనుక నీకలా అన్పిస్తోంది గాని నేను అక్కడ్నుంచి వచ్చిన వాడ్నేగా. మీ నాన్నా అక్కడి వాడేగా ! సో – నా వేళ్ళేకాదు నీ మూలాలూ పల్లెల్లోనే వున్నాయి "

"ఉంటే వుండనీ. మనిషి ఎదగాల్సింది పైపైకి. ప్లస్‌టూ కాగానే బన్నీని స్టేట్స్‌కి పంపించేద్దాం భాస్కర్. ఐఐటీల స్టాండర్డ్సు పడిపోయిందిట. ఇక ఇక్కడి డిగ్రీలకి వ్యాల్యూ వుండదు "

" మనం చదవలేదూ ?" అనలేదతడు. " స్టేట్స్‌కన్నా యూకే బెటరేమో ? అప్పుడు చూద్దాంలేగాని ఒకవారం రోజుల పాటు ఆసుపత్రీ రోగులూ జబ్బులూ డబ్బులూ అన్నీ మర్చిపోయి మా వూరు వెళ్ళొద్దాం. మనక్కూడా మొనాటనీ తగ్గుతుంది. ఛేంజ్ అవసరం....."

భర్త మాటలకి అయిష్టంగానే తలాడించింది.

విలేజ్ చూపిస్తానని ప్రామిస్ చేసేసరికి వెర్రి సంబరంతో పొంగిపోయాడు బన్నీ. ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి మరీ చెప్పేడు. ఒలింపిక్స్‌లో పాల్గోబోతున్నంత ఆనందంగా వుంది వాడికి.

ముగ్గురూ వేసవి శలవుల్లో దొడ్డిపట్ల వెళ్ళారు.

తిన్నగా భాస్కర్ వాళ్ళ బాబాయింటి కెళ్ళారు. బన్నీ పుట్టకముందు తండ్రి

చనిపోయినప్పుడు ఆ ఊరొచ్చారు. మళ్ళీ ఇదే రావటం !

గ్రామస్తులంతా ఆప్యాయంగా పలకరించారు. బన్నీ బుగ్గగిల్లారు. " సుబ్బారాయుడి పోలికే " అన్నారు.

సంబరంగా ఆహ్వానించాడు బాబాయి అనంతయ్య. బన్నీని చూస్తూనే భుజాల మీదికెత్తేసుకున్నాడాయన.

"నా మనవడు " అంటూ పొంగిపోతోంటే లలిత సైతం ముచ్చటపడింది.

"వీడు పల్లెటూరు చూస్తానంటేనూ...."

"ఎందుకనడూ, మట్టికీ మనిషికీ వున్న బంధం అలాటిది. తాతా మనవళ్ళ అనుబంధం అంత గట్టిది " అన్నారు అనంతయ్య.

తాతా మామ్మల్ని ఒక్క క్షణం కూడా వదల్టం లేదు బన్నీ. వాళ్ళతోడిదే లోకమైపోయింది వాడికి.

వింత ప్రపంచంలో ప్రవేశించినట్టుగా వుంది.

ఇళ్ళు, చెట్లు, మనుషులు, తోటలు, పశువులు, గోదావరి, వరిచేలు, అరటి తోటలు, పక్షులు .... చాలా కొత్తగా చిత్రంగా వున్నాయి. మధురానుభూతుల్ని పంచుతున్నాయి.

తాతతో బాటు తోటల్లో తిరిగాడు. ఆకుమడిలోని కలుపు మొక్కల్ని పీకాడు. అప్పుడే దించిన కొబ్బరి బొండాం నీళ్ళు త్రాగాడు. పశువుల వీపు మీద కుర్చుని స్వారీ చేశాడు. పాలు తాగుతోన్న దూడల్ని చూశాడు. పాలు పితకటమూ చూశాడు. కాలువలో ఈత కొట్టడం నేర్చుకున్నాడు. గోదావరి ఆవలిగట్టు వెనుక నుంచి ఉదయిస్తోన్న బాల సూర్యుడి వైభవానికి అబ్బుర పడ్డాడు. తనివి తీరా చూసి మురిసి పోయాడు. పడమటి చెట్ల మాటున అస్తమించిన సూర్యుడ్ని చూసి బాధపడ్డాడు.

పచ్చని ప్రకృతి అందాలను ఇంతింత కళ్ళతో చూశాడు. కోయిల కుహూ కుహూల్ని అనుకరించాడు. పిట్టల్ని పట్టుకోడానికి పరుగెత్తాడు. వడగళ్ళని కరిగే లోపల పట్టుకుని నోట్లో వేసుకోడానికి మిగతా కుర్రాళ్ళతో పోటీపడ్డాడు. వానలో తడుస్తూ చిందులేశాడు. ఇంద్రధనుస్సు రంగుల్నీ చూశాడు.

నక్షత్రాలు పొదిగిన నీలాకాశం అద్భుత పరిస్తే పొంగిపోయాడు. వెన్నెల్లో నులక మంచం మీద పడుకుని రాకుమారుల కథలు విన్నాడు. నానమ్మ పెట్టిన గోరు ముద్దలు తిన్నాడు. అప్పుడే చిలికి తీసిన వెన్న ముద్దా, వేడి పాల మీది మీగడా రుచి చూశాడు.

హైదరాబాద్ తిరిగొచ్చారు.

నవ్యోత్సాహంతో ఉప్పొంగి పోతున్నాడు బన్నీ. గలగలా మాట్లాడుతున్నాడు. చొరవగా ప్రవర్తిస్తున్నాడు. ఎడతెగని కబుర్లు చెబుతున్నాడు. అపూర్వ నిధి ఏదో చేజిక్కించుకున్నట్టు పరవశిస్తున్నాడు. పరమానందంలో మునిగి తేలుతున్నాడు.

"పావనీ ! నేను విలేజ్ చూశాను. ఎంత బావుందో చెప్పలేను. మార్నింగూ ఈవెనింగూ సూర్యుడు రెడ్‌గానే వున్నాడు. కంప్లీట్ రెడ్ కాదు ఆరెంజ్ కలిసినట్టున్నాడు. మీ బామ్మ చెప్పింది రైటే. నాకూ తాతా మామ్మా ఉన్నారు తెలుసా ? ఎన్ని కథలూ కబుర్లూ చెప్పేరో ! మా తాత పద్యాలు ఇంచక్కా పాడతాడు. మా మామ్మకి పాటలొచ్చు. అవి భలే బావుంటాయిలే....."

ప్రపంచ విజేతలా బన్నీ చెప్పుకుపోతున్నాడు. చైతన్య స్రవంతియై ప్రవహిస్తున్నాడు.

వాడి కళ్ళల్లో మెరుపులు మెరుస్తున్నాయి. ముఖంలో కాంతి గుప్పుమని వెలుగుతోంది.

బాల్యం మీది మమకారంతోనే భగవంతుడు సైతం కృష్ణ రామ అవతారాల్లో బాల్యాన్ని మరపురానిదిగా మలచుకున్న సంగతి గుర్తొచ్చింది. తమ మధురమైన బాల్యస్మృతులు వారి కళ్ళ ముందు కదిలాయి.

చెళ్ళున కొరడాతో ఎవరో కొట్టినట్టు అదిరిపడ్డారు భాస్కరూ లలితా.

ఇన్నేళ్ళూ వాడి ఉత్సాహాన్ని, అన్నీ తెలుసుకోవాలన్న జిజ్ఞాసని అదిమేసినట్టన్పించింది. చిదిమేసినట్టూ అన్పించింది. పుస్తకాల బరువుతో బాటు తమ కలల కోరికల బరువునీ వాడి మీద పడేసి వాడి బంగారు బాల్యాన్ని చిత్రహింసల పాల్జేసినట్టు అనుభూతి కలిగింది.

గుండెలు తడిబారాయి. పిమ్మట బరువెక్కాయి. గిల్టీగా ఫీలవుతూ సిగ్గుతో తలలు వంచుకున్నారు !

* * *

**(జాగృతి 8, నవంబర్ 2010)**